క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



రెడ్డిరామరాజు, ప్రిన్సిపల్

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పాలగిరి రెడ్డిరామరాజు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పాకాల కళాశాలకు బదిలీపై వచ్చారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉన్నం రవి అభినందించారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న బేబీశ్వర్‌రెడ్డి ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు



ఎస్పీడబ్ల్యూజేసీ విద్యార్థినులను అభినందిస్తున్న టీటీడీ డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులకు షైనింగ్ స్టార్స్ అవార్డు లభించింది. ఇటీవల మహతి ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో విద్యార్థినులు గంగా మానస, మలిశెట్టి నందలక్ష్మి, తణుకు పదిమ్మత, కొత్తపల్లి ఇందుప్రియ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో వారిని టీటీడీ డీఈఓ వెంకటసునీల్, ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సరస్వతీ అభినందించారు.

ఏఓ శ్రీనివాసులుకు వీడ్కోలు



శ్రీనివాసులును సత్కరిస్తున్న ఆర్టీఓ కార్యాలయ అధికారులు

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)గా విధులు నిర్వహిస్తూ మదనపల్లె రవాణాశాఖ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న ఎం.శ్రీనివాసులుకు బుధవారం సహాయక సంయుక్త రవాణా కమిషనర్ బి.కృష్ణవేణి, తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్‌తో పాటు ఎంవీఐలు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనను మెమెంటోతో ఘనంగా సత్కరించారు. రవాణాశాఖ ఏఓగా విశేష సేవలందించిన శ్రీనివాసులును డీటీవో ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మదనపల్లె నుంచి తిరుపతి రవాణాశాఖ కార్యాలయానికి పరిపాలనాధికారి(ఏఓ)గా విచ్చేసిన టి.విజయ్‌కుమార్‌ను సాదరంగా ఆహ్వానించారు.

మార్కెట్‌లోకి టాటా ఆల్ట్రోజ్



ఆల్ట్రోజ్ కారును ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ, షోరూం, టాటా మోటార్స్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని విజయభారతి టాటా మోటార్స్ షోరూంలో మంగళవారం టాటా మోటార్స్ వారి సరికొత్త ఆల్ట్రోజ్ కారును ఆర్టీఓ కె.మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా మోటార్స్ వారు సరికొత్తగా ఆధునిక టెక్నాలజీతో అందరికీ అందుబాటు ధరలో తీసుకురావడం సంతోషకరమన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతలు పాటించాలన్నారు. విజయభారతి టాటా మోటార్స్ షోరూం ఎండీ వెంకటరామన్, టాటా మోటార్స్ జోనల్ హెడ్ జయదీప్, రీజనల్ మేనేజర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

గంగమ్మ విగ్రహం పునఃప్రతిష్ట



గంగమ్మకు హారతి ఇస్తున్న తిమ్మారెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ కాలూరు పాత హరిజనవాడలో గంగమ్మ విగ్రహం పునఃప్రతిష్టను బుధవారం పూర్తి చేశారు. ఆ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ మొక్కల భారతి, తిమ్మారెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు.

పలువురు ఉద్యోగుల బదిలీ

తిరుపతి అర్బన్ : జిల్లాలో పలువురు ఉద్యోగులను బదిలీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయకుమార్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు. అలాగే చిత్తూరులో పనిచేస్తున్న నరేంద్ర తిరుపతికి బదిలీ అయ్యారు. జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య అనంతపురం, అక్కడ నుంచి గురుస్వామిశెట్టిని తిరుపతికి బదిలీ చేశారు. బుధవారం జిల్లా పౌర సంబంధాల అధికారిగా రమేష్ నియమితులయ్యారు. సహాయ సంచాలకుడిగా వేలాయుధం వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పద్మజను సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

నాగయ్యగారిపల్లి వద్ద ఉన్న స్వర్ణముఖినదిలో యథేచ్ఛగా భారీ వాహనాలతో ఇసుకను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



చంద్రగిరిలో పత్తిగుట్టను దోచేస్తున్న దృశ్యం (ఫైల్) (ఇన్‌సెట్) రెడ్డివారిపల్లిలోని స్వర్ణముఖినదిలో జేసీబీతో ఇసుకను తోడేస్తున్న ఇసుకాసురులు(ఫైల్)





ప్రకృతిపై పచ్చ నేతల విలయతాండవం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొండలు, గుట్టలే కాకుండా నదుల్లోని ఇసుక మేట్లు మాయమవుతున్నాయి. గ్రావెల్, గ్రానైట్, ఇసుక దందాలు యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఉచిత ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించాల్సింది పోయి ఏకంగా టిప్పర్లతో పక్క రాష్ట్రాలకు దర్జాగా తరలించి డబ్బులు దండుకుంటున్నారు. ఇవన్నీ కళ్లెదుటే జరుగుతున్నా అధికారులు మాత్రం తామేం చేయగలం.. ఇచ్చింది తీసుకోవడం తప్పా.. అన్నట్లు అధికార పార్టీ నేతలకు తలొగ్గుతున్నారు.

- ఏడాది కూటమి పాలనలో గల్లంతవుతున్న ప్రకృతి వనరులు
- చెలరేగుతున్న ఇసుక, మట్టి మాఫియా
- అర్ధరాత్రుల్లో అక్రమంగా ఇసుక రవాణా
- ప్రకృతి వనరుల రూపురేఖలే లేకుండా చేస్తున్న కూటమి నేతలు
- అధికారుల అండదండలతోనే చెలరేగుతున్న అక్రమార్కులు

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనతో అంతా అక్రమాలు, కబ్జాలే కనిపిస్తున్నాయి. ప్రకృతి సంపదపై కన్నేసిన కూటమి నేతలు యథేచ్ఛగా ఇసుక, మట్టి కొల్లగొట్టడంలో తలమునకలయ్యారు. రాత్రిబవళ్లు అక్రమంగా ఇసుకను, మట్టిని దోచుకుంటూ కోట్లాది రూపాయాలు కొల్లగొట్టారు. చంద్రగిరి మండలానికి చెందిన ఓ నేత అనధికారికంగా నాగయ్యగారిపల్లి వద్ద జేసీబీలు, టిప్పర్ల సాయంతో నిరంతరం కోట్లు రూపాయల విలువైన ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించారు. చంద్రగిరికి చెందిన ఓ యువనేత నియోజకవర్గ ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుంటూ స్వర్ణముఖినదిని దోచుకున్నారు. రెండు నెలల్లోనే సుమారు రూ.2 కోట్ల విలువైన ఇసుకను దోచేశారంటూ కూటమి నేతలే మండిపడ్డారు. మండపంపల్లి సమీపంలో టీడీపీ నేత హిటాచీల సాయంతో అక్రమంగా మట్టిని రవాణా చేస్తూ సొమ్ము చేసుకున్నాడు. రెడ్డివారిపల్లి సమీపంలో భారీగా డంపులను ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాలకు సైతం ఇసుకను విక్రయించి కూటమి నేతలు ప్రకృతి సంపదను కొల్లగొట్టేశారు. చంద్రగిరి పత్తిగుట్టను సైతం కూటమి నేతలు వదల్లేదు. ప్రభుత్వ పనుల పేరిట భారీ యంత్రాలతో ద్వారా పత్తిగుట్టను కొల్లగొట్టేశారు. మతంపల్లిలో ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన చెరువు కట్టను సైతం టీడీపీ నేతలు దోచుకెళ్లడంతో గ్రామస్తులు తిరగబడిన ఘటనలు ఉన్నాయి.



అక్రమంగా మట్టిని తవ్వేయడంతో ప్రమాదకరంగా మారిన కర్ణం చెరువు



టీడీపీ నేతలు డంప్ చేసిన ఇసుక

నామమాత్రపు కేసులతో సరి..

కూటమి నేతలు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నప్పటికీ రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సంపూర్ణ సహకారం అందించడంపై ప్రజలు మండిపడుతున్నారు. నామమాత్రంగా దాడులు చేయడం సామాన్యులపై కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని మండిపడుతున్నారు. ఇసుక, గ్రావెల్ దందాలపై పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు వాటాలు వెళ్లడంతోనే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.



రాయలపురం సమీపంలో ఇసుకను జల్లెడ పట్టి అధిక ధరలకు విక్రయిస్తున్న వైనం (ఫైల్)

వందల లోడ్ల మట్టి తరలింపు..

చంద్రగిరి మండలంలోని కూటమి నాయకులు ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లికి సమీపంలో ఉన్న కర్ణం చెరువులో అక్రమంగా వందల లోడ్ల మట్టిని తరలించారు. అలాగే దామలచెరువు పంచాయతీలోని వెంకట్రాయణి చెరువు, బందార్లపల్లి చెరువు, ఊటువంక చెరువుల్లో కూడా అక్రమంగా మట్టిని తరలించారు. నేంద్రగుంట రైల్వే గేటు సమీపంలోని చెరువులో జేసీబీలతో కొన్ని వందల లోడ్ల మట్టిని అక్రమంగా తరలించి పక్కనే ఉన్న ప్రైవేట్ వెంచర్ కి తరలించారు.



నేంద్రగుంట రైల్వేగేటు సమీపంలోని చెరువులో నుంచి మట్టిని జేసీబీ సాయంతో తరలిస్తున్న కూటమి నేతలు (ఇన్‌సెట్) చెరువులో మట్టి కోసం తవ్వడంతో ఏర్పడిన గోతులు

అపరిశుభ్రతపై కమిషనర్ ఫైర్



అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ఆటోనగర్‌లోని వాహనాలకు మరమ్మతులు చేసే ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె ఆటోనగర్‌లోని వాహనాలకు మరమ్మతులు చేసే ప్రాంతాలను నగరపాలక సంస్థ అధికారులతో పరిశీలించారు. పలుచోట్ల టైర్లు, వాహనాల విడిభాగాలు పడేసి అపరిశుభ్రంగా ఉంచడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగరంలో ప్రధాన ప్రాంతమైన ఆటో నగర్ పరిశుభ్రతపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేసిన వారికి, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లోని దుకాణదారులకు అపరాధ రుసుము విధించాలన్నారు. చెత్త కాల్చడం వంటివి చేయవద్దని సూచించారు. స్థానికులు, దుకాణదారుల కోరిక మేరకు డ్రైనేజీ కాలువలు నిర్మాణం, రోడ్ల ఏర్పాటుకు పరిశీలన చేస్తామని తెలిపారు. ఇలా కమిషనర్ రాంబాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, ఏసీపీ బాలాజీ, డీఈలు రమణ,శిల్ప తదితరులు ఉన్నారు.

పున్నమి వెన్నెల్లో కల్యాణ వెంకన్న



తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు గరుడుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి నెలా పౌర్ణమి గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. తిరుమల తరహాలో చేపట్టే పౌర్ణమి గరుడసేవకు భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శింకుంటారు. అందులో భాగంగా బుధవారం రాత్రి గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీకల్యాణ వేంకటేశ్వరుడి దర్శించిన భక్తులు కర్పూర హారతులు పట్టి గోవింద నామ స్మరణతో మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మలయప్ప స్వామి గరుడుడిపై అధిష్ఠించి భక్తులను కటాక్షించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గరుడవాహన సేవలో పాల్గొన్నారు.

ఎస్వీయూలో దొంగలు పడ్డారు!



హెచ్‌బ్లాక్‌లో కిటికీలను తొలగించి చోరీకి పాల్పడిన దుండగులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో భద్రత డొల్లతనం మరోసారి తేటతెల్లమైంది. ఇప్పటికే వర్సిటీలో వరస చోరీలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్సిటీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట శ్రీగంధం చెట్టును రాత్రికి రాత్రే మాయం చేశారు. గతంలోనూ స్క్రాప్‌ను వర్సిటీ ఉద్యోగి చోరీ చేసిన దొరికిపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి వర్సిటీలోని హెచ్ బ్లాక్ వసతి గృహంలో దుండగులు చొరబడి రూ.లక్షల విలువైన సామగ్రిని అపహరించినట్లు విద్యార్థులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. వసతి భవనం వెనుకవైపునున్న కిటికీలను దుండగులు తొలగించి స్టీలు టాప్‌లు, ఖరీదైన సింక్‌లు, ట్యూబ్ లైట్లు, కుర్చీలు తదితర వస్తువులను చోరీ చేశారు. ఇది ఇంటి దొంగల పనేనంటూ విద్యార్థులు, ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవలే ఇలాంటివి..



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఇటీవలే వర్సిటీలో చోరీలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. హెచ్‌బ్లాక్‌లో జరిగిన చోరీని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. రూ.లక్షలు విలువ చేసే సామగ్రిని దోచుకెళ్లినా అధికారులు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

– అశోక్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కో-కన్వీనర్, తిరుపతి

భద్రతను గాలికి వదిలేశారు



బయట వ్యక్తులు వర్సిటీలోకి చొరబడి దొంగతనం చేసే సాహసం చేయలేరు. ఇది కేవలం ఇక్కడ పనిచేసే వ్యక్తుల ప్రమేయంతోనే జరిగిందనే అనుమానం ఉంది. సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేసే స్థితిలో లేవు. నిందితులను కఠినంగా శిక్షించాలి.

– వినోద్ , ఎస్ఎఫ్ఐ ఎస్వీయూ కార్యదర్శి, తిరుపతి

14న 'అంకితం నీకు అంకితం'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిరుపతి ఫిలిం సొసైటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: గాన గంధర్వుడు పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకుని తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు 'అంకితం నీకు అంకితం' పేరిట పాటల సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాటల సంగీత విభావరికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 16 భాషల్లో 45 వేలకు పైగా పాటలు పాడిన గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం అని తెలిపారు. ఈనెల 14న సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి ఇంద్రజ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వైఎస్ బాబు, ఇన్‌చార్జ్ కార్యదర్శి శాంతావాణి, కోశాధికారి ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబు నాయుడు, సుబ్రమణ్యం, గుల్జార్, సి.రాజ్యలక్ష్మి, మేరిజాయ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న సానా ప్రసాద్‌కుమార్

తిరుపతి కల్చరల్: బీసీ రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేసి బీసీ కులాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాపు, బలిజ, తెలగ, ఒంటరి బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాన ప్రసాద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న ఆయన చిత్తూరు నుంచి మంగళగిరి వరకు తలపెట్టిన శాంతియుత పాదయాత్ర బుధవారం తిరుపతికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1910 నుంచి 1956 వరకు కాపు, బలిజ, తెలగ, ఒంటరి వంటి కులాలు ఉన్న బీసీ రిజర్వేషన్ తర్వాత అమలు జరగకపోవడం విడ్డూరమన్నారు. ఈ కులాల వారికి నాటి బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ శాంతియుత పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. పాదయాత్ర అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. పాదయాత్రగా తిరుపతికి చేరుకున్న సానా ప్రసాద్‌కుమార్‌కు స్థానిక బీసీ నేతలు స్వాగతం పలికారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాకాల : స్థానిక సంత ప్రదేశంలో పేదల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. బుధవారం ఈ సంఘం మండల అధ్యక్షుడిగా బందిల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మాదాసి ప్రభాకర్, కార్యదర్శిగా మరకాళ్ల కుప్పం తురకానయ్యతో పాటు 9 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదటి సమావేశాన్ని ప్రధాన కార్యదర్శి మాదాసి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సభ ఆమోదించిన తీర్మాణాలను వివరించారు. అలాగే పాకాల రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్‌కు ఎస్ఐ సంజీవరాయుడు

పాకాల : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలు జారీ చేశారు. చట్టం అందరికీ ఒకేలా వర్తిస్తుందని, పోలీసులు తప్పు చేసినా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మరోసారి నిరూపించారు. ఈ నేపథ్యంలోనే పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకాల ఎస్ఐ సంజీవరాయుడును వీఆర్‌కు బదిలీ చేశారు. నివేదికల ఆధారంగా మరికొందరిపై కూడా వేటు పడనున్నట్లు సమాచారం.

కేంద్ర మంత్రికి స్వాగతం



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పీసీరాయలు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ సలహా కమిటీ సభ్యుడు పీసీ రాయలు స్వాగతం పలికారు. బుధవారం కేంద్రమంత్రి సంజయ్ రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రికి పీసీ రాయలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికా రు.

నోటీస్ బోర్డు

- జిల్లాలోని పలు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు మూడు సెషన్లలో ఏపీ పీజీ సెట్ పరీక్షలు ప్రారంభం
- జిల్లాలోని 8 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శతావధాని ఆముదాల మురళిచే శ్రీమద్భాగవత సప్తాహం
- అప్పలాయగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహన సేవ.

నూతన కమిటీ ఎంపిక



బాలన్ అధ్యక్షుడు



అజీమ్ ప్రధాన కార్యదర్శి



ఎస్.సుభాన్ కోశాధికారి

తిరుపతి కల్చరల్: గుజిరీ వ్యాపారుల సంఘం నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి తెలిపారు. తాను గుజిరీ వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడిగా, సంఘం అధ్యక్షుడిగా ఆర్.బాలన్, ప్రధాన కార్యదర్శిగా ఎం.అజీమ్, ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, సహాయ కార్యదర్శిగా సుక్కూర్ మహబూబ్ బాషా, కోశాధికారిగా ఎస్.సుభాన్‌ను నియమించినట్లు చెప్పారు. అలాగే 9 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.